"చలం"

# అశ్లీలాలు

కొన్ని మాటలు బూతులనడానికికారణం అర్థంవల్ల. అంటే అవి సృష్టి కార్యానికీ, సృష్టి అవయవాలకీ సంబంధించినవికావడంచాత. సృష్టిదేనిమీద ఆధారపడివుందో అది అందరికీ తెలిసిన విషయమే. ప్రతివారు ఆచరించేదే, ఆచరించనివారు ఆచరించాలని అభిలాషపడేదే. కాని అది రహస్యమైపోయింది. మర్యాదస్తులు దాని విషయ మేమీ యెరగనట్టు నటించడంఆచారమైపోయింది. ముఖ్యంగా పిల్లలకు అజ్ఞానం విషంతుల్యంగా భావిస్తున్నారు. ఇంత రహస్యం కావడంచేత ఆ విషయానికి సంబంధించిన మాటలన్నీ అసభ్యాలైనాయి. మళ్ళీ ఆ మాటల్లోనే కొన్ని పర్యాయపదాలు బూతు, కొన్నికావు. శాస్త్ర రీత్యా వాడితే అభ్యంతరం లేదు. సాధారణ దైనిక సంభాషణల్లో వాడే మాటలుమాత్రం బూతు.

ఈ మాటల్ని ప్రతిరోజూ విననివా రుండరు. ప్రస్తుతం పట్టణాల్లో చదువుతున్నవారి నోటినించితప్ప, యీ బూతు మాటలు ప్రతివారి నోటినించీ వింటోనే వుంటాము. చాలామందికి, వీటిని ప్రయోగించేవారికి అవి మామూలు వూతపదాలైపోయినాయి. ఎవరినో తప్ప ఆ మాటలు షాక్ చెయ్యవు. కొంచెం నీతిపరుల మనుషులనేవారూ, చాలా సున్నితమైన శుచిత్వానికి 'chim' కలవారూ యితరుల సమక్షంలో 'షాక్' నటిస్తారు. పట్టి కూచుని ఆ మాటలు అర్థాన్ని గురించి భద్రంగా ఆలోచిస్తేనేగాని వాటిల్లోని ఘోరత్వం ఎవరికీ తట్టదు. వాటి అర్థాన్ని విడతీసి చూస్తే, చాలా వాటి అర్థం లేదు, వున్నా హాస్యాస్పదంగానో, వాంఛనీయంగానో వుంటాయి. బండీ తోలేవాడు తన యెద్దుని, 'నీతో మాదిగవాడు సంభోగిస్తే, నేనెంత సంతోషిస్తాను!' అంటాడు. అంటే యీ అర్థమిచ్చే మాటలంటాడు. కొడుకులు తల్లులకి యిట్లాంటి విచిత్రమైన

"చలం"

# బూతులు



దీవనలే. యిస్తోవుంటారు. ఎవరినన్నా తల్లిమీద తిట్టినట్టయితే మండిపడతారు. ఆ తల్లి అట్లాంటి దేమన్నా జరిగితే బావుండునని కోరుకుంటో వుండవొచ్చు. ఈ మాటల్లో చాలావరకు వుత్త 'conventional' తిట్లు. వాటి అర్థంవల్లకాదు. దీనికంతా మూలం సృష్టికార్యం అసహ్యమనుకోవడం వల్ల. దీనికి ప్రచారంలో వున్న నీతి తోడ్పడ్డది. పురుషుణ్ణి యెవరూ యీమాటలతో తిట్టరు. అతనికి సంబంధించిన స్త్రీలను, భార్యనో, అక్కనో, తల్లినో తిడతారు. అంటే పురుషుడికి పరస్త్రీసంగము గౌరవం. స్త్రీకిమాత్రం అమితమైన అవమానాన్ని కలుగచేస్తుంది.

ఇట్లా ప్రపంచంలో ఎప్పుడూ వింటున్న మాటల్నే అచ్చులో చూస్తే ప్రజలుగాని ప్రభుత్వంగాని వూరుకోరు. కాని నిజమైన ప్రపంచంలో వినే సంభాషణ వ్రాయాలంటే, యీ మాటలు గ్రంథకర్త ఉపయోగించి తీరాలి. వింటున్న మాటలే, చదవడం యిష్టంలేదు ప్రజలకి. దీంట్లో యేమీ అర్థంలేదు. వుత్త 'convention.' మాటలు వింటే చెడిపోరు. వుపయోగిస్తే చెడిపోరు. చదివితే తెడిపోతారు.

ప్రస్తుతం యీ అశ్లీలమనేది కొత్తగా వ్రాసేవారి పుసకాల్లో వుంటోందని గోలపడుతున్నారు. బూతులు లేవు, వుండడానికి వీల్లేదు. కాని సృష్టికార్యాన్ని ప్రోత్సహించే వర్ణనలు వున్నాయని వీరికి కోపం. sex 'టికిల్' కావడం, నిజం వొప్పుకోరుగాని—అందరికీ యిష్టమే ముఖ్యంగా యీ కథల మీద కోపగించే ముసలివారికి, ఈకథలు sexకి ఆకర్షకంగా, అందంగా, వాంఛనీయంగా చేస్తున్నాయి. 'రొమాన్టిక్' మెరుగుని పెడుతున్నాయి. ఉద్రేకాన్ని కలిగిస్తున్నాయి. ఇది కవిత్వానికి ఒక ముఖ్య లక్షణం. అందరికీ యిది చాలా యిష్టం. గొప్ప పురాణాల్లో కవిత్వ గ్రంథాల్లో యీ గుణం చాలా విస్తారంగా వుంది. ఈ కొత్తకథల్ని కూడా చదవక పారేశేవారు లేరు. కాని చదివితిట్టడం fashion అయింది. దీనికి అనేకకారణాలు. సంభోగ వాంఛ పుట్టించుకోడం అందరికీ యిష్టమే, కాని పుట్టిం

దని; పుట్టించు కొంటున్నామనీ, యితరులకి తెలీడం గాని, యితరులతో వొప్పుకోడంగాని యిష్టముండదు ఆపని రహస్యమూ నీచమూ ఐపోవడంవల్ల. అందుకని తిడతారు యీకథల్ని. అదిగాక సంభోగవాంఛ ప్రేరేపింపబడ్డ తరవాత, దాన్ని అనుభవించాలని కోర్కె కలుగుతుంది కొంతమందికి ఆ అదృష్టం వుండదు. వున్నా ఆకథల్లో వర్ణించి నంత సుందరంగా వుండదు; అట్లాంటి అలవాళ్లే పోయి నాయి. Sex మామూలు అలవాటుగా మారి పోయింది. భాగస్తులు అందమైనవారుగాని, ఆనందం కలి గించేవారుగాని దొరకరు. తనకీ ఏదో సౌందర్యాన్ని చూపి, ఆశగొలిపి, తృప్తినిచ్చే మార్గాన్ని చూపని యీ కథకుణ్ణిచూస్తే, అతను కలిగించినబాధకై, అతని మీద కోపం. కొందరికి యీ వర్ణనలు వారి prudish training వల్ల వెగటుని కలిగిస్తాయి.

ప్రస్తుతం యీకథలు, యింగ్లీషు చదువుకున్న నాగరికుల్నించే. సంభోగవాంఛకోసం మందులు తినే వారూ, అనుభవంకోసం స్త్రీలని వెతికేవారూ, స్నేహితులతో భోజనాలదగ్గిరా, క్లబ్బుల్లోనూ, బూతు మాటలు, బూతు wits వేసేవాళ్ళే, యీ కొత్త కథల్ని పద్యాల్నీ అసహ్యించుకునేది. అదంతా తను taste యెంత delicateగా వుందో చూపుకునేందుకు. తమ స్వంత వ్యవహారాలు మరుగు పరుచుకునేందుకు ప్రయోగించే ధూర్తత్వం.

పాతపుస్తకాల్లో, బైబిల్లో, పురాణాల్లో యెంత స్పష్టంగావ్రాసినా, దానిని చేదినీ బూతు అన లేదు, ఈనాడూ అనరు. అసలు లోకంలోని గొప్ప పుస్తకా లన్నిటిలోనూ శృంగారరసమే ప్రధానం.శృంగా రమే సృష్టికి పునాది.

కృష్ణుడు రాధ, సత్యభామల మీదా పాడేసి యిష్టం వొచ్చినట్టు బూతులువ్రాసి భక్తికింద దాచారు. మోక్షానికని, వృద్ధులందరూ చదివి, మన్మధోద్రేకానికి చక్కిలిగింతలు పెట్టుకుంటూనే వున్నారు. సంభోగ వాంఛా ప్రేరేపణ, అసహజమూ లేదు. తప్పూ కాదు. మరి యీ అర్చనలూ, యీ కష్టాలూ, భోజనాలూ, వేషాలూ, అన్నీ అందుకేగా! ఈ పుస్తకాలని భద్రంగా దాచుకు చదువుతారు. పైకి తిట్టి. పుస్తకాల్ని విసిరి పుచ్చుకుని పక్కమీదపారేసి, యింకా యిట్లాంటి పుస్త కాలున్నాయా అని విచారిస్తారు. ఎందుకంటే మోహోద్రేకమంత ఆనంద జనకమైన వస్తువ సులభ సాధ్యమైనది యింకోటిలేదు.

చాలామందికి జీవితంలో శృంగారం నశించింది, అసహ్యంగా మారిపోయి ది. ఎప్పుడో చిన్నప్పుడుయే యేడాదో అప్పుడప్పుడు కొంచెంగా గోచరించి మాయ మయింది. వారి శరీరాలు భరించలేనంత అందవికారా లైపోయినాయి; ఇంక శృంగారం ఏ విధంగానూ యీ జన్మలో తటిస్తుందనే ఆశలేదు. ఆకార్యంకూడా కష్టతరమయింది, మొత్తానికి ఏమాత్రమూ ప్రత్యేక ఆనం దాన్నీ యివ్వటానికిలేదు. శృంగారానికి కాపరానికీ, ఏ మాత్రమూ సంబంధం వొదిలిపోయింది. కనక వీరికి ఆసంగతి, ఆనందం, సౌందర్యం, యేమాత్రం మాట్లా డినా వొళ్లుమంట; తమకి తెలీని యీర్ష్య. ఈ లోకంలో సుఖపడే మార్గాలన్నీ మూసుకుపోగా, దృష్టిని పరలోకంవేపూ, నీతి పుణ్యాలవేపూ మర ల్చారు. ఇక్కడ ఆనందపడలేక పోవడమనే సంగతి, పుణ్యలోక ప్రవేశాలకు అర్హత నిచ్చే టిక్కెట్లను కుంటున్నారు. కనక పత్యంలో వున్నవాడికి పిండివంటల సంగతెత్తితే యెంతకోపమో, మోహం సంగతివర్ణిస్తే వీరికంతకోపం.

ఈ శరీరసంపర్కం విఘాతమైతే, విరక్తి కలి గితే, రోత పడేట్టు చేస్తే అది పరిశుభ్రమూ అవు తోంది. చివరికి భార్యా భర్తలైనా, ఒకరి దేహంలో ఒకరు నిమగ్నులై, ఆ సౌఖ్యాలలో ఆనంద మనుభ వించారంటే, బూతూ, యింద్రియలోలత్వమూ అవు

తుంది. ఏ నియమాలవల్లనో, కష్టాలవల్లనో, విడిపడి చచ్చారంటే అది పవిత్రత అయింది. "అట్లాగే అనేక సంవత్సరాలు ఒంటరిగా కాలం గడిపింది" అని వ్రాసి సులభంగా పవిత్రంగా కథను ముగిస్తారు. అట్లా సులభంగా కాలం గడపగల రోగిష్టులు ఎక్కడో గాని వుండరు. అన్నిసంవత్సరాలూ ఏం చేస్తోంది? పురుషుడిమీద కోర్కె కలగలేదా? కామానికిఅలవాటు పడ్డ దేహం ఆ అలవాటునించి యెట్లా తప్పించుకుంది? తక్కిన అలవాట్లమీసులభంగా వొదలవే! ఈ అలవాటు నెట్లా వొదులుకుంది? ఆ వుపాయమెదో మాకూ చెప్పరాదా కథకుడు! ఏమైనా మందులు తీసుకుందా? ఆమెకి రాత్రులు సరిగా నిద్రపట్టిందా? ఎట్లాంటికలలు వచ్చాయి? నిద్రపట్టని రాత్రులు ఏ ఆలోచనలూ భావనలు కంగాయి? వాటి పర్యవసానమేమిటి? అన్ని సంవత్సరాలు భోజనం చేస్తోందో! ఆ భోజనం రక్తంగా మారటం లేదా? ఇట్లాంటి ప్రశ్నలు ఎవరికి పట్టవు. భర్తలు వున్న పతివ్రతలు పరపురుషున్ని చూశారా? చూస్తే భర్తలతో పోల్చుకున్నారా? వారికోసం ఆసపడ్డారా? ఇదంతా యెందుకు? వాళ్ళు లేచి పోలేదు. లేచిపోతానంటే, భర్త ఆమె కాళ్ళమీదపడి బతిమాలిన సంగతి బైటికిరాదు.

బూతుఅనేది సర్వత్రా వుంది. కుక్కలు, పిచికలు, ఆవులు, అన్నీ బూతుపనులే చేస్తున్నాయి. పువ్వులన్ని బూతులే, వాటి అందమంతా వ్యభిచారాకర్షణే! బూతంతా దృష్టిలో వుంది. కొందరు నిర్మల మనస్కులు వెంటనే వెంటనే బూతు కనిపెట్టగలరు. కొందరికి అది సామాన్యంమాటగా కనపడి బూతు అనిపించదు. కొందరి పవిత్రనేత్రాలు సాధారణపు మాటలోకూడా, యీ అక్షరం లోపిస్తే యీ అచ్చుపొరబాటు జరిగితే, యీ సంధికలిస్తే ఎంతబూతు అయ్యేది అని, స్త్రీలకోసం, బాలురకోసం, దిగులు పడతారు. ఈ నీతిపరులు ఏ పుస్తకం చదివినాసరే, "పందులు కుళ్ళు బురదని వాసనపట్టి సూటిగా ఆ స్తలానికి పరిగెత్తినట్టు, బూతుభాగం యెక్కడవుందా అని పసిపడుతూ పోతారు" అన్నాడు గాటియర్.

వీరి అవినీతికి అర్థం, పెళ్లికానివారు దేహసౌఖ్యాన్ని అనుభవించడం పెళ్ళైనవారు ఎంత నీచంగా యెంత వొళ్ళుమరచి, అసహ్యంగా, చివరికి rape చేసినా, అదంతా నీతే! వివాహంలో వున్నకుళ్ళు దుర్నీతి, అసహ్యం, జారత్వం, పశుత్వం, అంతా నీతి శృంగారమే వీరి కళ్లకి. చివరికి మొగవాడు నాటకంలో వేషంవేసినా సరే, ఆ కులుకులూ, ఆ దొంగ స్తనాలూ చూసి, అవైనా చివరికిచూసి ఆనందిచాలని టిక్కట్లకోసం దేవులాడే యీ ప్రజలే, యీ రసికావతంసులే, శృంగారానికి ఎల్లలు నిర్ణయించే రసికావసంతులు. ఆనాటకంలో, ఆ మొగ చంద్రముతుల్ని, సీతల్ని చూసి, వెళ్లి, ఆతాపం అణుచుకోలేక, ఇంటివద్ద వారుపడే బాధలూ, వాళ్ళ రహస్యకార్యాలూ ఎవరికి తెలుసు ?

బూతులో రెండోకరం వుంది. ఇది ప్రజలు కనిపెట్టరు, ప్రజ లందరికీ యిష్టం యిది ఇదే స్త్రీని ఇంత అధోగతికి తెచ్చింది. లోకానికి స్త్రీ పురుష సంబంధమంటే చాలాలోకువ, "కన్ టెంప్టు" నిరసనభావం. ఇదే మనుష్య హృదయంలోని సగ ఆనందాన్ని సౌందర్యాన్ని చంపింది. తమకు లోబడిన స్త్రీలమీదే ప్రజలకి గౌరవం. బైటికి తిడతారుగాని, మనసులోపల వారిమీదే గౌరవం. లోబడిన ఆమెని యెంగిలైనట్టు, తాము మురికిచేసి వొదిలినట్టు, మాట్లాడతారు. వీరికి రహస్య సంభోగవర్ణనలూ, బూతుబొమ్మకార్డులూ, యిష్టం. వాటిని ఎవరికీ కనపడకండా దాచుకొని రహస్యంగా చూసుకుని, ఏమీ ఎరగనట్టు నటిస్తేనేగాని వీరికి తృప్తివుండదు. బహిరంగంగా సెక్సు సంగతులు వ్రాసినా, శృంగారం ఆరోగ్యంగా ఉన్నతంగా వ్రాసినా, వీరికి అయిష్టం. ముఖ్యం స్త్రీ వృత్తములాలంటె ఆమెకి

కొన్ని యిష్టాలూ, వున్నా యంటే భరించలేరు. ఇట్లాంటివారే "స్త్రీ బుద్ధి ప్రళయాంతకహా, సౌందర్యవతీ భార్యా శత్రుహూ, "ఆడదానివి కావులె! నా పెళ్ళాన్ని చంపుకుంటే నీకేం? ఆడదాని మల్లే భయపడతావు" యిట్లాంటివి సంభాషణల్లో వాడతారు.

'సైకో ఎనాలిసిస్' ప్రకారం యీ నిర్మల వాదులంత మనోవ్యభిచారకులు యెవరూ లేరు. బూతు మాటలతో షాక్ అయ్యేవారు బూతు మాట్లాడే ధైర్యం లేకో, బూతునంతా మనసుల అడుగుకి తొక్కుకున్న మనుషులు. అవినీతి మీద మండిపడే వారు, అవినీతి కోర్కెలుండి, ఆవిధంగా సంచరించగల ధైర్యమో, అదృష్టమో లేక, ఆ అవినీతిని అంతరాళంలో దాచుకుని, దాచుకున్నామని తెలీని నిర్భాగ్యులు. తాము దేన్ని దాచుకుని, అసలు తమలో లేదని తాము తమనే మోసపుచ్చుకుంటున్నారో, దాన్ని కళ్ళయెదుట యెవరన్నా కనపరిస్తే, తబ్బిబ్బై, మండిపడతారు. దేన్ని రహస్యస్థలానికి నెట్టివేశారో, అది యెక్కడికీ పోలేదని, చూపి, దాచుకున్నదాన్ని బైటికి లాగినందుకు, తమని ప్రోత్సహించాడని, ఆ వర్ణనలు చేసినవాణ్ణి తిట్టిపోస్తారు— అజీర్ణంవాడిచేత పిండిపంటలు తినిపించాడని.

వీరి కళ్ళకు కనపడే బూతుకి దిక్కూ చాలూ లేదు. అన్ని conventions ఒకరి దగ్గిర్నించి ఒకరు నేర్చుకుంటారు. అందరూ బూతు అంటే తాము అంటారు. ఏమిటా బూతు అని అడగరు. ఇట్లాంటి విషయాల్లో వారి సుకుమారమైన మనసులు పనిచెయ్యనే చెయ్యవు. పద్యంలో వ్రాస్తే బూతు కనపడనివారికి అదే వచనంలో బూతు. ఇంగ్లీషులో బూతులు మింగేవారు, తెలుగులో బూతుల్ని పైకి కక్కేస్తారు. పాత పుస్తకాల్లో సంస్కృతంగా, పాత తెలుగులో, తాటాకులమీద. బూజులమధ్య, పెళుసుకాయితాలమధ్య బూతులు చప్పరించే మహానుభావులు, కొత్తపత్రికల్లో బూతుల్ని వుమ్మేస్తారు. గ్రాంధికంలో వ్రాస్తే కొంతవరకు బూతు పరిహారమౌతుంది, వ్యవహారికంలో ముఖ్యంగా గ్రామ్యంలో బూతు అతి వ్యక్తమౌతుంది. యెంకిపాటలు అంటె బూతుగ్రంధం యీనాటివాళ్ళకి. ఎంకి పాటలు పాడతో వుంటో బూతులు విన్నట్లు. యికిలించేయీనాటి ఆంధ్ర ప్రజలకు యెంత భేషజం, యెంత గర్వం, కళలకు తాము నెలవులైనట్లు!

అంతేకాదు స్త్రీ చంకల్ని వర్ణిస్తే బూతు పురుషుడి చంకల్ని వర్ణిస్తే హాస్యం. బాహుమూలరుచితో, అంటే మహాగౌరవం. అట్లానే వక్షోజాలు, breasts అంటే ఫరవాలేదు వాటికే అచ్చతెలుగు వ్రాస్తే బూతు.

ఇట్లా స్త్రీని లోకువ చెయ్యడమూ, చవకగా చూడడమూ, కొంచెం యిప్పుడే స్వేచ్ఛని పొందుతున్న స్త్రీలని పరిహసించే గుణం చాలామంది నవీన కథకులకి వుంది. ఎంతో స్త్రీల తరపున వ్రాస్తున్నామనే వారి కథలలో కూడా యీ 'స్నీర్' కనబడుతుంది. అదిగాక చదువుకున్న భార్యల్నీ, స్వతంత్రాభిలాషుల్ని దూషించేవి, వెక్కిరించేవి చాలా కథలున్నాయి. ఒక సుప్రసిద్ధ ఆంధ్ర కథకురాలు, వ్యాసకర్తె ఒకామె, నాటకాలలో వేషాలువేసే స్త్రీని తన నాయికగా తీసుకుని కథవ్రాసి కీర్తి తెచ్చుకుంది. కాని ఎవరైనా పరిశీలించి ఆ కథని చదివితే, ఆకథలో, ఆ కథానాయికబోటి స్త్రీలు స్వేచ్ఛలో అనుభవించే ఆనందం తన కీజన్మకి లభించే యోగ్యత లేదుగనుక, ఆ ఆకర్షణా తనికిలేదు గనక, తన నెవరూ రంగస్థలానికి రమ్మనరు గనక, హృదయంలో మండే యీర్ష్యని ప్రత్యక్షరంలోనూ చూపింది. కొందరు పేరుకెక్కిన కథకులు

"నేను ఆ వర్ణనల జోలికిపోను. కాని నేనే వర్ణించ తలుచుకుంటేనా!" అన్నట్టు వూరికే గుటకలు మింగుతో వ్రాస్తారు. కొందరు చుక్కలు పెట్టి వొదులుతారు.

ఈబూతు పవిత్రత యీనాటి చిత్రాల్లోనూ, తెలుగు ఫిల్ముల్లోనూ బాగా చూడవొచ్చు. పటం సరస్వతిదే భారతిదే, కాని చిత్రకారుడో, చిత్రకారిణో, ఆ సంగీత సాహిత్యాల రెండింటిమీదా యెంత కౌశల్యం చూపాడో జాగ్రత్తగా పరిశీలిస్తే, ఆ పవిత్రపటాల్లో ఎంత బూతువుందో అర్థమవుతుంది. కాని ఆ సరస్వతి బ్రహ్మ నెదిరించిందనో, బ్రహ్మని సభలో నాలుగో ముఖంమీద ముద్దుపెట్టుకున్నదనో వ్రాస్తే అది బూతవుతుంది. ఎందుకంటే కళలో ఒక

శాసనంవుంది. ఎంత దాచాలన్నా. యెన్ని మెలికలు తిప్పినా, రచయిత ఆత్మే, sub-conscious self, ప్రతిఫలించి తీరుతుంది కళలో. ప్రతిఫలమేకాదు- సూర్యుడికీ కాంతికీ వున్న సంబంధమే రచయితకీ కళకీ వుంటుంది. మడి కట్టుకున్నవారిలోనించి బూతూ, అవినీతిపుస్తకాల్లో ఆధ్యాత్మిక సందేశమూ, కనపడ్డానికి యిదే హేతువు.

ఫిల్ముకథ రామాయణమే, భాగవతమే-సాంఘికంగా నీతిబోధకమే, మాటలన్నీ నీతులే, ధర్మాలే! కాని ఆ పతివ్రతల వేషాలువేసిన పాత్రల చేష్టల్ని జాగ్రత్తగా చూడండి. సీత యేమిటి, నడుము మెలికలతో, జాలి పాటలతో అట్లా ఆహ్వానిస్తుంది? చంద్రమతి కలిగించే జాలిలో ఉద్రేకంవుందేం? యశోద కృష్ణుడి ప్రియురాలిలాగు వర్తిస్తుందేం? ఇదంతా ఆత్మసంస్కార ఫలితం? పతివ్రతల పాత్రలకి అందమైన స్త్రీలని యేరడంలోనే కనపడుతుంది, యెటువంటి పాతివ్రత్యాన్ని కోరుతోందో ఆడియన్సు. కవులుకూడా కావ్యాల్లో యీ పతివ్రతల్ని సర్వాంగాలూ వర్ణించినప్పుడే తెలుసుకోవొచ్చు, వారి మనసుల్లోని పవిత్రపు బూతు; ఈ పురాతన దాంపత్యమంతా ధర్మాలమీద ఆధారపడ్డదికదా, గుణాలుచూసేకదా, వీరి వరించడాలు, చివరికి భారత భాగోతాల్లోకూడా మొగాళ్లకి ఎగుభుజాలూ, విశాల వక్షాలూ, వొంటి మెరుగులూ, సన్నని నడుములూ, వర్ణించడ మెందుకు? ఆవర్ణనలే, పతివ్రతలకు పెట్టిన వర్ణనలలే, వచనంలో యీనాటి స్త్రీలకిపెడితే బూతులైనాయి. కాని పురాణాల్లో యెట్లా వర్ణిస్తేనేం, భక్తి ప్రభావంవల్ల, యీ తలుపులు అన్నీ కప్పి పడిపోతాయి రామాయణం చదివితే, సీత మీద కామం కలగదు. కాని ఫిల్ముచూస్తే, సీతని కావిలించుకోవాలని బుద్ధి కలుగుతుంది- మొత్తానికి ఆఫిల్ము పతివ్రతల అసలుసంగతి తెలీని సామాన్య ప్రజలకి!

పూర్తిగా అంతా బట్టబయలైతే, యీ మురుగువాంఛలు వుండేనేవుండవు. ఫిల్ములో అనసూయ పిర్రలుమాత్రం కనపరిస్తేనే, ఆడియన్సు, అటు చూడ్డానికి వీలుంటుందేమోనని మెడలు చాస్తారుగాని అసలు సుఖంగా అనసూయ చుట్టూ తిరిగిందా కళ్లు మూసుకుంటారు, సిగ్గుతో కాదు, అసహ్యంతో. ఎంతో మరీ దత్తిపడ్డవాళ్లనీ, శృంగారంలో మరీ low taste నీచపు అభిరుచిగలవారినీ తప్ప, యీనాటి తెలుగు ఫిల్ము నక్షత్రాలు ఎవరికళ్లనూ మిరుమిట్లు గొలపవు. అట్లానే పుస్తకాలలో వర్ణనలుకూడా. ఈనాటి గొప్పకవి మిత్రులలో ఒకాయన యీమన్నాడంటే; "అంతా సంపూర్ణంగా వర్ణించడంలో ఏమీ ఆకర్షణలేదు. art చెడిపోతుంది. ఎందుకు అట్లా వర్ణిస్తారు? కాళిదాసు చూడండి ఎంత మృదువుగా, సున్నితంగా వర్ణిస్తాడో స్త్రీలనీ" అన్నాడు.

"నేనుచేసే స్త్రీ వర్ణనలు కోర్కెని అభివృద్ధి చెయ్యడానికోసం కాదు. కోర్కెని చంపడంకోసం. ఒక్క కామ వ్యాపారానికితప్ప, స్త్రీని చూసినంత మాత్రాన, మోహం కలగడం అసహజం. ఈ వర్ణనలు మామూలై 'షాక్' చెయ్య పోవాలి అంటే!"

"కాళిదాసు సుకుమార వర్ణనలలోవున్న voluptuousness, కోర్కెని భావననీ రేపేగుణం ఇంక యెవరిలోనూ లేదు. అది మన ఆత్మశృంగార ఔన్నత్యం. మహా అనుభవశాలి, అద్వితీయుడైన కళోపాసకుడు. ఇంకేం కావాలి? "అనాఘ్రాతం పుష్పం" అనేమాటని గురించి ఆలోచించండి. అంతకన్న అవినీతిప్రదమూ, స్వార్థపరమూ, దేవిరింపుమాటా, ఎక్కడన్నా వుంటుందేమో! "అనాఘ్రాతం" తన కోసమే తన అనుభవంకోసమే-ఎవ్వరూ తాకకుండా వుంచారు. తను- ఆలోచించండి- ఎన్ని గోచరిస్తాయో మనసుకి! అంత కక్కుర్తి అంత నీచత్వం- ఆస్త్రీ ఒక వూరగాయి, ఒక తాటిపండు, ఈగలు వాలని మిఠాయి- అదీ దుష్యంతుడికివున్న గౌరవం స్త్రీలమీద. "అనాఘ్రాతం పుష్పం" అని చదివేప్పటికి, ఆ అందమైన పదాలవల్ల, సెంటిమెంటువల్ల, carry ఐ పోతారు. అది subtle గా రహస్యంగా మనుషుల మనసుల్లో పనిచేసి స్త్రీనించి "అనాఘ్రాతం మొదలు తరువాత స్వంత ఆఘ్రాతం, తను మాత్రమే ఆఘ్రాతం- పుష్పం- తన జేబుల్లో, గదుల్లో భద్రంగా చెట్టునించి కోసి దాచుకునే పుష్పం- కాళ్లులేవు, కళ్లులేవు- వుత్త పుష్పం, దానికి మనసులేదు (ఆత్మలేదు. ఎవడు కోసుకొంటె వాడిదీ. అనాఘ్రాతం పుష్పం- అంటే సుకు

మారం, పవిత్రతా, అన్నీ వుండిపడ్డట్లు- ధ్వనిస్తుంది. పుష్పం చెట్టుకి సృష్టి అవయవం.

ఆ పుష్పం అనాఘ్రాతంగానే వుండిపోయిందనుకోండి. అది అట్లానే వుండదు. ములిసిదై అందరూ అసహ్యించుకునే, దిక్కులేని అవయవమై పోతుంది. ఎవరో ఒకరు ఆఘ్రాణించాలనే కనిపెట్టుకునివుంది. నిర్మలత్వం రంగురంగుల రేకులుదాల్చి ఎవడో ఒకడు అనిర్మలం చేసేందుకుగా ఆ నిర్మలత్వం. దుష్యంతుడు శకుంతలని, చూసిన కొంచెం సేపటికే, పాదాలవొత్తనా? అని అడుగుతాడు. అదిచూసి మన కవులు ఎంత మార్దవమూ అంటారు. అంతటి మహారాజు ఆమెపాదాలు వొత్తన్నాడే అనే గౌరవం తప్ప, భాగ్యవంతులు innocent బీద కన్యల్ని మోసంచేసి అన్యాయంచేసేందు కుపయోగించే eternal trick మామూలు టక్కరుపని అని తెలుసుకోరు. ఎంత ధూర్తత్వం పాదాలు వొత్తడం?

ఈ నవీన నీతికథకులు, కవులు, యీ బూతు పనుల్లో, కాళిదాసుని తలతంతున్నారు. ఉపన్యాసాల్లో దుర్మార్గుల చేతుల్లో చిక్కిన పతివ్రతల బాధలు వర్ణించడంలో, అవినీతిమీద చూపేకోపంలో ఎన్ని కోర్కెలు, ఎంతదతి! యెంత కాపీనం, దాచుకోవాలని తనకే అట్టిపెట్టుకోవాలని అంతా తనేబావుకోవాలని మింగాలని, ఇతరులకి నీతులు బోధించి వారిని విరక్తుల్ని చేసి, మానిపించి, ఆరికట్టి తనే పొందాలనీ యెంత ప్రయత్నం! ఇవన్నీ వారి హృదయాల్లో నిగూఢమైన motives ఐ, వారిచేత నీతికథల్ని వ్రాయిస్తావుంటాయి.

భార్యాభర్తలచేతే నీతి మాట్లాడిస్తో బూతులకన్న అసహ్యం ఆ మాటల్లో ధ్వనింపచేసే మహాశక్తి వుంది యీనీతి రచయితలకు. వీరు భార్యాభర్తల మధ్య పెట్టిన సంభాషణలు విన్న తరవాత, కొంచెం taste ఉన్నవారికి భార్యలన్నా స్త్రీలన్నా విరక్తి కలగక మానదు. ఆ కథానాయికల ఏడుపులు, నోములు, మూరాలు- అన్నీ అమితమైన అసహ్యాన్ని కలిగిస్తాయి. అసలు రచయితలు వుద్దేశ్యం సంసారాన్ని చాలా ఆకర్షంగా చూపాలనే- కాని వారి ఆత్మ సంస్కారంవల్ల కథ చివరికట్లా తయారవుతుంది.

ఒక నీతికథకుడు స్నేహితు లిద్దరు ఒకరి భార్యని ఒకరు మోహించిన కథ వ్రాశారు. నీతిని కాపాడుకునేందుకు ఆ దంపతులు పడే అవస్థలు ఆ కథలోని emotional effect కాని వారి అవస్థలు, వారి మనోభావాలు చదివితే, ఇంత చేయించారా యీ దంపతుల చేత, ఇంక ఒక్క పక్కమీద పడుకున్నారని వ్రాస్తే, మునుచుకుపోయిందా అనిపిస్తుంది. శృంగారం, అణుచుకోలేని మోహం, వైరికామం ఇవన్నీ కావాలి, కథకి పట్టింపు నివ్వడానికి. పనికిరానిది ఏమిటంటె, పక్కమీద కలుసుకుని ఆ మోహాన్ని తీర్చుకోడం. మనసూ, నరాలూ, బతుకూ అంతా పరపురుషుడిమీది కోర్కతో నిండిం తరవాత, యింక యీ పిచ్చి దేహాన్ని విడిగావుంచి కాపాడా ననుకున్నాడు కథకుడు నీతిని. అంత మాత్రపు నీతినే యీ ప్రపంచం కోరుతోంది. పూర్వకాలం యూరప్‌లో క్రిస్టియన్ ఫాదర్లు, యీమన్నారంటె అవినీతిఅంటే, ఆ చివరికార్యం-కనక స్త్రీలను పక్కల్లో పడుకోపెట్టుకుని, ఆ కాస్తా త్యజించి, తక్కినదంతా అనుభవించి తమ బ్రహ్మచర్యాన్ని కాపాడుకునేవారు. అట్లావుంది యీ కథకులనీతి. ఫిల్ముల్లో చూడండి 'విలన్' దుర్మార్గుడు ఆ పతివ్రతని బలాత్కరించడంలో ఆమెని యిష్టంవొచ్చినట్టు తాకుతాడు. కాని పాతివ్రత్యస్థానం మాత్రం అందక పోవడంవల్ల నీతి కాపాడబడ్డది. ఆనీతి, ఆ పవిత్రత మనసునించి శరీరానికి, శరీరంనించి, ఒక్క భాగానికి మాత్రమే దిగింది యీనాటికి. ఇంకా నీతిపరులు ఇంకా నిగూఢమైన స్వల్పస్థలాలకి నెట్టివెయ్యవొచ్చు క్రమంగా.

"చూడండి ఈకథలు, ఆడవాళ్లూ పిల్లలూ యెట్లా చదువుతారు?" అంటారు. ఆ పిల్లలు మృగాల్లోనూ, నిద్రపోతున్న కళ్ళసందుల్లోంచి రాత్రిలు పెద్దవాళ్లు చేసే పనులలోనూ, సంగతులన్నీ చూస్తోనే వున్నారు. వీధుల్లోనూ తమ పెద్దవారి నోటినించికూడా బూతుల్ని వింటోనే వున్నారు. ఆ స్త్రీలూ పిల్లలూ వొంటరిగా వున్నప్పుడు మాట్లాడుకునే బూతుల్నేవింటే, యీ కథలు వ్రాసేవారు సిగ్గుపడి పారిపోతారు. ఈ దేవాలయాలమీద భక్తితో బూతుబొమ్మల్ని చూసి నమస్కరిస్తున్నారు కూడాను.

ఈ కథలలో అంతా స్త్రీవర్ణనలేగాముఖ్యం? వాటిని స్త్రీలు చదివితేనేం? స్త్రీమీద స్త్రీకి మోహం కలిగిస్తున్నామనా వీరి అభ్యంతరం? స్త్రీనివర్ణిస్తేతప్ప

బూతుకాదు. వెడద వక్షమువాడు, నిక్క భుజముల వాడు, రొమ్ముమీద దట్టమైన వెంట్రుకలు కల వాడు, పద్మనేత్రుడు అంటే అంతా సభ్యమే! ఆ ప్రదేశాలే స్త్రీని వర్ణిస్తే బూతు.

ఆడవాళ్ళూ, పిల్లలూ, చెడిపోతారట. ఎదో పురుషుడు చాలా వివేకవంతుడైనట్టూ చెడిపోని లోహమైనట్టూ!

ఇప్పటి కథలు స్త్రీకి గౌరవాన్నిసున్నాయి. ఆమెని కథకి మూలసూత్రం చేశాయి. పురుష హృదయాన్ని పాలించేశక్తి ఆమె. ఆమెకి వేరే వ్యక్తిత్వం, వాంఛలూ, స్వతంత్రపు ఆలోచనలూ వున్నాయి. ఇదంతా ప్రపంచానికి అవినీతి, స్త్రీని పురుషులు అమితంగా కోరతారు. అంతేకాదు, ఆమె సౌందర్యానికీ, చమత్కారానికీ ఆమెని వాంఛస్తారుఅంటే తప్పుపడుతున్నారు. అవినీతి అంతా వీరికిబూతు. ఒక్క వర్ణన లేకుండా, చాలా పవిత్రంగా సుఖంగా, ఆనందంగా, ఒక్క తగాదా లేకుండా idealగా ఒక స్త్రీ ఒక పురుషుడు గాఢ ప్రేమలో బతుకుతున్నారు- పెళ్ళిమాత్రం కాలేదంటే అతిబూతుకథే! ఎంతమె కొట్టుకోడం, రాముడికి పరపురుషుడతకాడనేభావం, ఎన్నాళ్ళకీ పోకపోవడం- తనని అడివిలో వొదిలేసిన నలుడు కనపడగానే దమయంతి వెంటనే కావిలించుకోడం, ఇట్లాంటివి ఎన్నో, వాటిల్లో బూతు కనిపించదు.

ఏ పుస్తకంలోనైనా సరే, స్త్రీని,నీచంచేశారా, స్త్రీపురుషసంబంధాన్ని చవకచేశారా, ఆపుస్తకం కన్న బూతుపుస్తకం లేదు.

గాఢమైన నిర్మలమైన ప్రేమను చూపితే అంత బూతు. ఒక కాపరంలో ఇద్దరూ వూరికే పందుల్లాగు కంటున్నారని, కుక్కల్లాగా కరుచుకొంటున్నారనీ, ద్వేషించుకొంటున్నారనీ, అతి నీచంగా ఒకరినొకరు వుపయోగించుకుంటున్నారని యేమివ్రాసినా, పెళ్ళి అయిందంటే బూతుకాదు.

ఇదివరకు పాతపురాణాల్లో, స్త్రీ, యీశ్వరుడి అవతారమైనాసరే, ఆమె చివరికి నిర్జీవయంత్రం- మెదడు, గుణమూలేని బొమ్మ, చాలామంది స్త్రీలని చపలచిత్తలనూ, కులటలనూ, చేసి చెడగొట్టారు. మిగిలిన వాళ్ళని గతిలేని దౌర్భాగ్యుల్ని చేశారు. రావణుడు సీతనెత్తుకుపోయి రోజాతోటలో పెట్టుకుని చూసుకుంటోవుండడంలో, రాముడూ రావణుడు ఆ స్త్రీకోసం అసలు నిజమైన బూతుమాటలూ వర్ణనలూ యేవంటే- సృష్టికార్యాన్ని అసహ్యమైన కార్యంగా వర్ణించేవి. కొంతవరకు వైరాగ్య గ్రంథాలలో కొన్ని భాగాలు యీ శీర్షికకిందికి వొస్తాయి. ఆ కార్యాన్ని తప్పు అనీ, నీచమనీ, సంస్కారమనీ, లోకోద్ధరణమనీ, రహస్యమనీ, ధర్మమనీ అనేవన్నీ బూతులే. దాన్ని రహస్య పరిచేవి బూతులే. అనేక పద్యాలు దంపతుల్ని గర్భాదానం గదివరకు తీసికెళ్ళి అక్కడ వొదిలి మాట్లాడకండా యివతలికి వొస్తాయి, యీనాటి కథలుకూడా యింతే. కొంతమంది మర్యాదస్తుల కథలు చదివితే వీళ్ళెన్నడన్నా పిల్లల్నికన్నారా, కనగలరా, అసలు ఆసంగతులు వీళ్ళకితెలుసునా, అని సందేహం కలుగుతుంది.

నిజంగా బూతులు, యీ ప్రేమ కథలూకావు, శృంగార వర్ణనలూకావు. వాటిని అసహ్యించుకునే యీ విద్యాధికులే నిజమైనబూతుని కల్పిస్తున్నారు. స్త్రీ సంభోగమూ, స్త్రీ అవయవాలవర్ణనా, యౌవ్వనం, వాంఛా, యివన్ని హేళనకి ప్రధానవస్తువులు ప్రజలకి. లేచి పోవడమూ, వాంఛవల్ల కుమలడమూ, యిబ్బందుల్లోకి రావడం, ప్రేమ దృష్టులు, విరహం, యివన్నీ జీవితంలో నిజంగా జరిగినప్పుడు, తెలుసుకుని, చెప్పుకుని, హేళనగా నవ్వుతారన్న సంగతి ప్రతివారికీ తెలుసు. ఎదన్నా యిట్లాంటిది వూళ్ళో జరిగినప్పుడుగాని, పత్రికల్లో పడ్డప్పుడుగాని యెంత ఆతృతతో తెలుసుకుంటారో, అంత వెగటుగా నీచంగా పరిహాసంచేస్తారు. ఆ స్త్రీపురుషుల అవివేకానికి, superior laugh రహస్యంగా యెవరికీ తెలీకండా కానిచ్చి తప్పించు దొంగతనంగా పోనిచ్చేదానికి, బైటపెట్టుకుని కష్టాల్లో పడ్డారని, తామె ఐతే యెంతో వివేకంగా తప్పించుకునే వారమని, superior laugh· రహస్యంగా యెవరికీ తెలీకండా కానిచ్చి తప్పించుకునే దానికి, చిక్కుల్లోకి వొచ్చారని, సులభంగా దొంగతనంగా పోనిచ్చే, దానికే, బైటపెట్టుకుని కష్టాల్లో పడ్డారని, తామే ఐతే యెంతో వివేకంగా తప్పించుకునేవారని, contemptuous laugh ఆ కథల వెనకవున్న tragedy ఆ

గాథల వెనకవున్న sincerity ఆ వాంఛల వెనకవున్న అగ్ని, ఇవే మీ వారి మనసుకి తట్టవు. చాలా soberiety వున్న పత్రికలే యిట్లా గూఢంగా 'స్నీర్' చెయ్యడం కనిపెట్ట వొచ్చు మనం ఈ అవివేకులవల్లంగా. యీకామానికి ఆహుతైన ప్రజల పరంగా పోనీ, జాలిగా, సానుభూతితో మాట్లాడ్డానికిగాని వ్రాయడానికిగాని గుండెలులేవే. అది bad taste ఎవరన్నా వ్రాస్తే బూతులు వ్రాస్తున్నాడనీ, అవినీతిని బోధిస్తున్నాడనీ, అరుపులు. ఈ మర్యాద కాథా రచకులే ముఖ్యంగా అరుస్తారు యితరులు అవినీతికథల్ని వ్రాస్తున్నారన్ని. ఆ నీతికథలవాళ్ళలో వర్ణనలుండవు, ప్రియులువుండరు, భార్యా భర్తలు తప్ప, బ్రహ్మచారులు వొస్తే వారికి చివరకి పెళ్ళి జ్వరగితీరుతుంది యథావిధిగా మర్యాదగా. భార్యాభర్తలకి సరాగాలూ, తగాదాలూ వుండవొచ్చు. కాని ఒకరిని వొకరు విడవరు. ప్రియులకి విఘాతాలు కలిగితే వాళ్లు చావడమో, సన్యసించడమో చేస్తారు. ఇదంతా సరేకాని వారు యీ పతివ్రతల నోళ్ళలోపెట్టే సంభాషణలు వినండి. అవి సరిగా జీవితానికి ఫోటోలే అయివుంటాయి. వాటిని చదినవిప్పుడు వారు యే మనుషుల్ని గమనించి కథలు వ్రాశారో, వారెంత నీచులో అని దిగులుపుడుతుంది. భయపడే మాటలన్నీ, వీరు భార్యలనోటినించి రానిస్తారు. భార్యాభర్తలేగా! ప్రియులు చెయ్యని బూతు పనులు భార్యాభర్తలచేత చేయిస్తారు. పవిత్ర సంసారంగా! ఎంత నీచంగా, చవకగా యీ స్త్రీపురుష సంబంధాన్ని చేస్తేనేం, వివాహనియమాల్ని పాలింపజేస్తే చాలు. ఈనీతి కథలూ, యీవిద్యాధికుల సంభాషణలూవింటె, ఏ స్త్రీనైనా, ఆమనుష్యుడు కావిలించుకోడంవల్ల యేమాత్రమైనా ఆనందం కలిగిందా, (ఆత్మసాఫల్యం, మనోతృప్తి పోనీండి) పూర్ణమైన శరీరసౌఖ్యమైనాకలిగిందా, లేక తనని, ఆ స్త్రీని, తనవాంఛని ద్వేషించుకొంటో అనుభవించాడా అనిపిస్తుంది. స్త్రీ ఒక యంత్రం. తన మోహం బలవత్తం. తనవాంఛకి దాసుడై తానుచేసిన దుస్సాహకార్యం, సుందరమైన సంయోగం, అసహ్యమూ దుర్భరమూ అయింది. మనసులో, మాటలలోకూడా అట్లానే పరిణమించింది. ఎవరైనా ఒకరు, శరీరం చాలా ఆకర్షక వయిందనీ, ఆ శరీరాన్ని, ఆ అందాన్ని అనుభవించడం మహా వరతుల్యమనీ వ్రాస్తే, ఆ వ్రాసినవాడు వుత్త భోగలాలసుడనీ, దుర్నీతి బోధకుడనీ, నిరీశ్వరవాది అనీ, ఆధ్యాత్మిక మహాత్మ్యాన్నెరగక, ప్రజల మనసుల్ని తుచ్ఛవిషయాలవేపు తిప్పుతున్నాడనీ, విసుక్కుని, superiorగా మొహాలుపెట్టి, ఏవగించుకున్నట్టు నటిస్తారు.

ఈ మురికితనం మనుషుల మనసుల్లో కలగడానికి కారణం, శరీరంలో ఒకదానికిఒకటి దగ్గిరిగా ఉన్న సృష్టిద్వారానికీ, మలద్వారానికీఉన్న భేదభావం confuseఐ నశించడంవల్ల నని D. H. లారెన్సు అన్నాడు. Sexమీద వున్మేసి, నీతి వస్త్రాలకింద, దొంగవేషాలు వేసుకునే యీనీతిగ్రంథాలే నిజమైన బూతుగ్రంథాలు. స్త్రీ సృష్టి సంబంధమైన సౌందర్యాన్ని మతముపేరిట అసహ్య పరచడమే నిజమైన బూతు.

